మనస్తత్వాలు

చెల్లెలు వివాహం నిశ్చయమయ్యిందనీ, ఫలానా తేదీన వివాహం జరుగుతుంది గాబట్టి, ఓపదిరోజులు ముందుగా మీరిద్దరూ రావల్సిందనీ, శారదకి వాళ్ళ నాన్న వుత్తరం రాశాడు. శంకర్రావుకి కూడా మరో ఉత్తరం రాశాడు. శారద ఆనందానికి పరిధి లేకపోయింది.

''మనం యెప్పుడు వెళ్తామండీ?'' వుత్సాహపూరితంగా అడిగింది భర్తను.

శంకర్రావు క్షణం మౌనం దాల్చాడు.

''నువ్వు వెళ్ళు శారదా రేపు ... నేను రాలేను...'' అన్నాడు మెల్లగా.

“మరి — మీరు యెప్పుడొస్తారు ?''

“నేను రాలేను...'' సాలోచనగా, యింక అధికం మాట్లాడదల్చుకోలేదన్నట్టుగా, ముక్తసరిగా అన్నాడు.

శారద స్తంభించిపోయింది. భర్త నుండి అటువంటి జవాబు వస్తుందనిగాని, అంత ముభావంగా జవాబిస్తారని గాని ఆమె యెప్పుడూ వూహించలేదు. అసలు, ఆయన అలా అనడానికి కారణం యేమిటో ఆమె వూహకి అందలేదు.

“అదేమిటండీ ? మీరు రాకపోతే యెవరైనా యేమనుకుంటారుచెప్పండి!”

''ఒహరు అనుకునేదేమిటి శారదా : నేను వెళ్ళకపోతే, పెళ్ళి ఆగిపోదుగా!'' విసుగ్గానే అన్నాడు శంకర్రావు.

భర్త ఆ మాట అనడంతో, అతని నిర్ణయానికి యేదో కారణం వుంటుందని నిర్ధారణ చేసుకుంది శారద. అదేమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి, ఆతృత కలిగా యామెలో.

“అంత విసుగెందుకండీ ? అసలు, కారణం యేమిటో చెప్పండి...మావాళ్ళే మైనా అసందర్భంగా ప్రవర్తించారా ? పోనీ అదైనా చెప్పండి ... వాళ్ళ తరపున నేను క్షమాపణ చెప్పుకుంటాను.'' అమాయకంగా అంది శారద,

“నీతో గొప్పచిక్కొచ్చింది శారదా!” అంతే అన్నాడుగాని, తను రాకపోవడానికి కారణం యేమిటో చెప్పలేదు.

శారదకి ఏడుపొచ్చినంత పనయ్యింది.

''మీరు రాకపోతే, నేను వెళ్ళడమెందుకు ? నేనూ వెళ్ళను...” అంది బుంగమూతి పెట్టుకుని.

“మంచి చిక్కే శారదా ! మీ చెల్లెలి పెళ్ళికి నువ్వు వెళ్ళకపోతే, నలుగురూ నన్ను ఆడిస్తారు...”

ముద్దంశెట్టి హనుమంతరావు

"ఊహూ! అదంతా నాకుతెలీదు... మీరు రాకపోతే, నేనూ వెళ్ళను..." మొండిగా అంది.

శంకర్రావుకి యేం చేయడమో, పాలు పోవడంలేదు. తను యేవిషయమైతే చెప్ప దల్చుకోలేదో, అది యిప్పుడు చెప్పక తప్పదనుకున్నాడు.

"పెళ్ళికొడుకు పేరేమిటో చెప్పు.." అన్నాడు.

శారదకి అతని ధోరణి అర్థంకాలేదు.

"ఆతడిపేరుకీ మీరు రాకపోవడానికీ సంబంధం యేమిటండీ?"

"అది తర్వాత చెప్తాను... ముందు పేరుచెప్పు..."

"ప్రసాదరావు గారు మోను..." విసుగ్గా చెప్పింది.

"ఔనా! ఆ ప్రసాదుగాడు నాకు ప్రబల విరోధి..వాడూ, నేనూ హైస్కూల్లో చదువు వెలిగించాంలే! వాడిప్పుడు కాలేజీ చదువు ముగించి, డిగ్రీ సంపాదించా డనుకో!"

శారదకి భర్తచెప్తున్న వుపోద్ఘాత మంతా విసుగుకలిగించింది.

"ఇంతకీ, మీరు చెప్పదల్చుకున్న దేవిటండీ?"

"బాగుంది...రామాయణమంతా విని, రాముడికి సీత యేమౌతుందని యెవరో నీలాంటివాళ్ళే అడిగారట...వాడు నాకు విరోధిగాబట్టి, వాడిపెళ్ళికి నేనురాను... రాదల్చుకోలేదు. ఈ సంబంధం తప్పి పోతుందేమోనని చూశానుగాని, లాభం లేకపోయింది..."

కారణం తెలీసంతవరకు శారద యెంత గాభరాపడిందో, తెలిశాక అంతగా నవ్వింది.

"మంచి వారేనండీ! ఇంకా మీలో చిన్నతనం పోనట్టుంది. ఇంతకీ మీరు అతడు పిలవగా వెళ్ళడంలేదుగా! మీ మరదలు పెళ్ళికి వెళ్తున్నారు ... మా నాన్న మిమ్మల్ని ఆహ్వానించాడు." నవ్వుతూనే అంది శారద. పెళ్ళికి రాక పోవడానికి యిదో పెద్ద అవాంతరంగా భావించలేదామె.

"అయినా సరే శారదా! ఈ విషయలోమాత్రం నన్ను బలవంతం చెయ్యకు. వాణ్ణి చూస్తేనే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది...నువ్వు వెళ్ళిరా! నిన్ను ఆటంకపర్చను...ఎంత దూరమని మహా? మువ్వయిమైళ్ళేగా! ఒక్కగంట ప్రయాణం. ముందుగా వుత్తరం రాసివేస్తే, మీ నాన్న స్టేషనుకు వస్తాడు." అన్నాడు శంకర్రావు.

భర్త పట్టుదలకు చాలా బాధపడింది శారద. అతని సున్నితహృదయం గాయ పడిందని, ఆ గాయం మానడానికి సమయం తీసుకుంటుందనీ తీర్మానించు కుంది. ఏం చెయ్యడమా అన్న సందిగ్ధంలో పడింది. భర్తనువదిలి వెళ్ళనూలేదు ... వెళ్ళకండా వుండనూ లేదు. చెల్లెలి పెళ్ళాయె! వెళ్ళకపోతే, తలిదండ్రులమాట యెలావున్నా, చెల్లెలు యెంత బాధపడుతుందో ఆమెకితెలుసు.

"ఏవిటోనండీ మీ చాదస్తం! ఎప్పుడో స్కూల్లో విరోధం పడ్డారని, ఆ కక్ష యిన్నేళ్ళవరకూ మనసులో వుంచుకుంటే యెలాచెప్పండి? స్కూలు జీవితమేవేరు. అక్కడి వాతావరణం, అప్పటి సంఘర్షలు, ఆస్కూలు ఆవరణ లోనే వదిలిపెట్టి బైటపడాలని మా మేష్టరుగారు అప్పుడప్పుడు చెప్తుండే వారు. నామాటవినండీ ... అవన్నీ మనసులో పెట్టుకోకండి, బైలుదేరండి." అంది ప్రాధేయపూర్వకంగా.

శంకర్రావుకి కోపం వస్తున్నా, ఆమె అమాయకత్వం, ప్రాధేయత, అతని కోపాన్ని అణచివేశాయి.

"నీతో వచ్చిన చిక్కే యిది శారదా! చెప్పింది అర్థం చేసుకోవు. కోపగించు కుంటే, కన్నీరు పెట్టుకుంటావు. నా భావాల్ని అర్థం చేసుకోడానికి ప్రయ త్నించు ... వాటిని చిత్రవధ చెయ్యకు. నా మనుస్సు నీకు తెలీందేమీ కాదు. అందుకే నన్ను బలవంతం చెయ్యొద్దని చెప్తున్నాను. ఈ రోజే మీ నాన్నకి ఓ వుత్తరం రాసేస్తాను. నువ్వు మాత్రం



"ఇంత పొడవు కిరీటము – అంత ఎత్తు చెప్పులు ధరిస్తే వేషధారి తాటిచెట్టు లాగా మరీ తయారౌతాడేమో !?......"
"మరేం ఫర్వాలేదులే ... ఏవరేజ్ మాన్కైతే నువ్వన్నది నిజమే...కాని మా హీరో వీటిని ధరిస్తే హీరోయిన్ ఎత్తుకి సమాన మవుతున్నాడు..."

యెల్లుండి ప్యాసింజరుకి బైలుదేరు..." అన్నాడు బోధపర్చే ధోరణిలో.

శారద, యెదురు చెప్పలేకపోయింది. ఎదురు చెప్పే మనస్తత్వమే కాదామెది. భర్త అంత పట్టుదలతో చెప్తుంటే, యింక బలవంతం చేసి, అతణ్ణి విసిగించడం యిష్టంలేదు.

"మీరు యెందుకు రాలేదని ఎవరైనా అడిగితే, ఏం చెప్పమంటారు ?" అంది నిస్పృహతో.

శంకర్రావు మొహంలో వికాసం వచ్చింది. "ఏం చెప్తావు ? వుందిగా బ్రహ్మాస్త్రం! ఎంత ప్రయత్నించినా శలవు దొరకలేదని చెప్పే సెయ్. వివాహ సమయాల్లో యిటువంటి అబద్ధాలు తప్పు కిందికి రావులే !" నవ్వుతూనే అన్నాడు.

"మీ యిష్టమే కానీయండి..." అంది శారద.

ఆ సమస్యేదో అప్పటికి పరిష్కార మైనట్టుగా నిట్టూర్చాడు శంకర్రావు... అసంతృప్తిగా నిట్టూరుస్తూ, అక్కణ్ణించి నిష్క్రమించింది శారద.

* * *

వివాహం నిర్విఘ్నంగా జరిగింది.

శంకర్రావు గురించి చాలా మంది అడిగారు. అందరికీ శారద తండ్రి కుటుంబరావు. శారద చెప్పిన జవాబే చెప్పాడు. అంతటితో వూరుకోక "ఆఫీసుల్లో యిచ్చే జీతాలు తక్కువయినా, శలవివ్వకుండా పని చేయించుకోవడం మాత్రం యెప్పుడూ జరుగుతున్నదే." అన్న వాక్యం కూడా కలుపుతుండే వాడు. తను రిటైరయ్యాడు గాబట్టి అంత ధైర్యంగా చెప్పగలుగుతున్నాడా విషయాన్ని. కాని, అతను సబ్ హెడ్‌గా వున్నపుడు యెంత మందికి శలవు ఇవ్వడంలో అల్లరిపెట్టేవాడో, అప్పుడే మర్చిపోయాడు కుటుంబరావు. అందరిలానే పెళ్ళికొడుకు ప్రసాదరావు కూడా అడిగాడు శంకర్రావు గురించి. రికార్డువేసినట్టుగా అదే జవాబు చెప్పాడు కుటుంబరావు.

కాని, ప్రసాదరావు ఆ సాకు నిజమైనదని నమ్మలేక పోయాడు. ప్రయత్నిస్తే, యేదీ అసాధ్యం కాదని అతని నమ్మకం. శంకర్రావు ప్రయత్న పూర్వకంగానే వుండిపోయాడని నిర్ధారణ చేసుకున్నాడు. తమ యిరిపురికీ యేనాడో జరిగిన కలహం యింకా అతని మనసులో రగులుతున్నదని వూహించడానికి ఆట్టే సమయం పట్టలేదు. శంకర్రావు మనస్తత్వం అతనికేం కొత్తకాదు. ఎంత సహృదయుడో సమయమొస్తే, అంత కఠిన హృదయుడనీ తెలుసు. జీవితపు బాటలో సంఘటిల్లే ప్రతీ సంఘటననీ యిట్టే మర్చిపోయి, కులాసాగా కాలం గడిపే వారూవున్నారు. కొన్ని సంఘటనలు మర్చిపోలేక మనసులో ఆట్టే పెట్టుకున్న వాళ్ళూ వున్నారు. అలా అని వాళ్ళు మంచివాళ్ళు కారని కాదు. వాళ్ళ మనస్తత్వం అంత! ఆ కోవకి చెందినవాడే శంకర్రావని ప్రసాదరావు అభిప్రాయం.

* * *

శారద తిరిగి వచ్చేసింది. శంకర్రావు పెళ్ళి విశేషాలు అడిగాడు.

"మీరు యెందుకు రాలేదని ప్రతి వాళ్ళూ ప్రశ్నించడమేనండీ! గ్రామఫోను రికార్డులా ఒకే సమాధానం చెప్పడానికి నేనూ, మా నాన్నా, విసిగిపోయామంటే నమ్మండి..." అంది శారద.

వెళ్ళకపోవడం వల్లనే తన విలువ పెరిగిందేమోనని అనుకున్నాడు శంకర్రావు.

"పెళ్ళికొడుకు నన్ను గురించి అడిగాడా?" ఆ ప్రశ్న అడక్కుండా వుండలేకపోయాడు.

"అడిగాడనే నాన్న చెప్పాడు. మీరు రాలేదని చాలా బాధ పడ్డాడట. శలవు దొరక్క కాదు — యింకేదో కారణం వుంటుందని కూడా అనేశాడట...".

"అదిగో! నేను చెప్పానుగా! వాడికీ మనసులో ఆ కష్టవుండబట్టే, అలా అనుమానించగలిగాడు. అందరూ నన్ను గురించి అడుగుతున్నారు గాబట్టి, వాడూ

అడిగాడు గాని, - లేకపోతే అడిగేవాడు కాదు..."

"ఏమోనండి మరి! అది అతని మనసుకే తెలియాలి..." అంటూ వూరుకుంది శారద.

వారం రోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం. ఉదయం యెనిమిది గంటలకు కాఫీ త్రాగి బజారుకి బైలు దేరాడు శంకర్రావు. శారద ఏవిఁటేవిఁటి తీసుకు రావాలో దండకం చదువుతోంది. సరిగ్గా అదే సమయానికి గుమ్మంలో రిక్షా ఆగడం యిద్దరూ గమనించారు. ఎవరా అని కాస్తముందు కొచ్చారు.

రిక్షాలోంచి మొట్టమొదట ప్రసాదరావు దిగడం చూసి, శంకర్రావు కొయ్యబారిపోయాడనే చెప్పాలి. ఆ తర్వాత శారద చెల్లెలు దిగింది. తన యింటికి వచ్చిన అతిథి ప్రసాదరావు యిప్పుడు. మునుపటిలా విరోధి కాడు. అతిథి అన్నమాటేవిఁటి? సన్నిహిత బంధువు. అటువంటి వాణ్ణి, అదీ యింటికి వచ్చిన వాణ్ణి పలుకరించడమా మానడమా అన్న ఆలోచనల్లో మునిగిపోయాడు శంకర్రావు. ఆ సరికే ప్రసాదరావు, శారద చెల్లెలు లోపలికి వచ్చేశారు. చెల్లెల్ని యెంతో ఆప్యాయంతో ఆహ్వానించింది శారద. శంకర్రావు ప్రసాదరావుని పలుకరిద్దామనుకుంటున్నంతలో, ప్రసాదరావే అన్నాడు.

"నువ్వు మా పెళ్ళికి రాకపోయినా, నువ్వు పిలవకుండానే మీ యింటికి వచ్చాం శంకరం! ఒకప్పుడు సహపాఠకులం. యిప్పుడుతోటి అల్లుళ్ళం. మనం యెప్పుడన్నా అనుకున్నామా యిలా జరుగుతుందని?" నవ్వుతూనే అన్నాడు.

శంకర్రావుకి ఆ మాటల్లోని ప్రతీ పదం ఓ కొరడా దెబ్బలా తగిలింది. తన సంకుచిత తత్వానికి లోలోన సిగ్గుపడిపోయాడు. తను ఇంకా యిలా ప్రవర్తించకూడదనుకున్నాడు. "నాకు శలవు దొరక్క మీ వివాహ సందర్భంలో రాలేకపోయాను ప్రసాద్ ... దానికేం లే; ఇప్పుడు మీ ఇద్దరూ మా ఇంటికిరావడం మా కెంతో ఆనందంగా వుంది. ఏం మరదలా_నీ పెళ్ళికి రాలేదని కోపగించుకోకు సుమా!...అఁ_ప్రసాద్ లోపలికిపద... నే నలా బజారుకి వెళ్ళివస్తాను. ఈలోగా నువ్వు స్నానం ముగించు..." అంటూ చరచరా బైటికి నడిచాడు.

భర్త తత్వం శారదకి అవగాహన కాలేదు. ఆనాడు కక్షగట్టి అసహ్యించుకున్న ప్రసాదరావుతో, యిప్పుడు యింత ఆప్యాయంగా మాట్లాడారే! వాళ్ళే తనింటికి వచ్చారన్న ఆధిక్యతతో కక్షమాట మర్చిపోయారా!...యేవిటో ఆమె యిదమిత్థమని తేల్చుకోలేకపోయింది. ఎలాగవుతేనేం - వాళ్ళిద్దరూ గతాన్ని మర్చిపోయి కొత్తఅనుబంధాన్ని యేర్పరచుకోవడమే అంతా వాంఛించేది ... అదే జరిగింది గనుక తృప్తిగా నిట్టూర్పు విడిచింది శారద. ★